
**కథ**



“రా సార్ రా నీకోసమే ఎదురు జూచ్చాండా” అన్నాడు మహానందిరెడ్డి. చిరునవ్వు నవ్వుతూ వచ్చి మంచంలో కూర్చున్నాడు నారాయణ.

“రేయ్ మీ యమ్మతో జెప్పు పో, పసు ల్డాక్టరొచ్చినాడు కాఫీ గాంచమని” కొడు కును కేకేశాడు. అనిల్ వంటింట్లోకి పరుగు తీశాడు.

“మా నాయన్తో పెద్ద సావొచ్చి పన్యాది సార్. సెబితే అర్థం జేస్కోడు. మూణ్రోజు ల్నుంచీ తనూ బాధ పడ్తాండాడు, మమ్మల్నీ బాధ పెడ్తాండాడు” అన్నాడు మహానంది.

“పెద్ద డాక్టరు రాసిచ్చిన మందులు వాడ్తాండారు గదా! ఉబ్బస రోగం అంతే మరి. సంతోషంగా బతకనీదు. సుఖంగాచావనీదు. ముప్పతిప్పలు బెట్టి మూడు చెరువుల నీరు తాగిచ్చుంది. మూడు సూదులేస్తే దారిలోకొచ్చుంది”

వసారాలో పడుకున్న కొండారెడ్డి కళ్లు తెరిచాడు నారాయణ మాటలు విని.

“ఆయన బాధ పడేది ఆయన రోగం గురించి కాద్సార్. ఆయన పెద్దకొడుకు బసవేశ్వర రెడ్డి గురించి” కాస్త వ్యంగ్యంగా అన్నాడు మహానంది.

నారాయణ అధికారికంగా పశువుల డాక్టరేయ్తైనా అనధికారికంగా మనుషులకు కూడా వైద్యం చేస్తుంటాడు. ఆయన హస్తవాసి మంచిదని ఆ ఊరివారి నమ్మకం. ఎవరు పిలిచినా వెంటనే ఇంటివద్దకే వస్తాడు. ఇంతిమ్మని అడగడు. ఎంతిచ్చినా వద్దనడు. ఏమీ ఇవ్వకున్నా వైద్యం చేస్తాడు. ఎప్పుడో ఒకసారి ఎండుమిరపకాయలలో, వేరుశనక్కాయలలో అతని ఫీజు కింద జమయిపోతుంటాయి. చాలా మంచోడని పేరుంది.

కొండారెడ్డికి మహానంది ఒక్కడే కొడుకు. ఈ పెద్ద కొడుకెవరబ్బా అని ఆలోచిస్తూ కాఫీ అందుకున్నాడు నారాయణ.


నారాయణ ముఖంలోని ప్రశ్నార్థకాన్ని అర్థం చేసుకొన్న మహానంది వెంటనే...

“పెద్దకొడుకంటే ఎవరో కాద్సార్. మా ఎద్దు” అన్నాడు. వారి మాటలకు కొండారెడ్డి లేచి కూర్చున్నాడు.

“అదిగో జూడు, ఇయ్యాల్దాకా సచ్చినట్లు పడుకున్న ముసలోడు ఎద్దు మాట వినపడగానే ఎట్లా లేచి కూర్చున్నాడో”.

# పెద్దకొడుకు

వై. రామాంజనేయులురెడ్డి




మహానంది ఎత్తిపొడుపు మాటలకు కొండారెడ్డికి గుండెలోకి ముల్లు కర్రతో పొడిచినట్లయింది. ఎద్దు ఒంటిపై రక్తం పొడుచుకొచ్చినట్లు కోపం పొడుచుకొచ్చింది.

"అనురా అను. ఎల్లకాలం వొయసోడిగానే ఉండవులేరా, నీకూ నా గతి పట్టకపోదు" అంటూ మూడో కాలుకోసం మంచం కింద వెతుకుతూ అన్నాడు కొండారెడ్డి.

"గాడపాటు మార్చారేంటి?" అన్నాడు నారాయణ.

"అవున్సార్, వాస్తు ప్రకారం ఇక్కడ ఉండగూడ్దంట. అందుకే బైటికి మార్చినా దీనిక్కూడా మా నాయిన గొణుగుతాండాడు"

"ఈ వాస్తు దయ్యాన్ని ఎవరు జనం మీదికి ఉసిగొల్పాడో గానీ పెద్ద రోగమై గూచ్చుంది. పాత ఇండ్లను పడగొట్టుకుంటూ కొత్త అప్పుల్ని కొని తెచ్చుకుంటాండారు. పసుల్ని బైటికి తరిమి మనుషులు మట్టుకు లోపల ఎచ్చగా కుల్కుతాండారు" ఎగతాళిగా అన్నాడు కొండారెడ్డి.

"ఏం దొంట్లను ఇంట్లో పెట్టి మనం బైట పండుకోవాల్నా చలిలో"

"పండుకోరా ఏం? దొంట్లకు మాత్రం సలేయదా. అయి మన కళ్లెదుట వుంటేనే గదరా వాటికెప్పుడు ఏం అవసరమో మనకు తెల్సేది" అన్నాడు కొండారెడ్డి ఆవేదనతో.

ఆ ఆవేదనలో సత్యం లేకపోలేదు. పాతతరం వారు పశువులను తమలో ఒకరిగా చూసుకునేవారు. అందుకే నాటి ఇండ్లలోకి అడుగుపెట్టగానే పశువులు ఒక పక్క వెంటనే కన్పించేవి. కొన్ని చోట్ల అయితే పశువులశాల గుండానే ఇంట్లోకి పోవలసి వుంటుంది. అవి ఎల్లప్పుడూ మన కళ్లెదుటే ఉండాలని ఆ ఏర్పాట్లు. వ్యవసాయం కలిసిరాక ఆర్థికంగా చితికిపోయిన రైతు వాస్తు వలలో చిక్కుకున్నాడు. ఈ వాస్తుకు తోడు పశువుల మలమూత్రాల వాసనంటే పడని కొత్తతరం పుట్టుకొచ్చి పల్లెటూరి ఇండ్ల రూపురేఖలు మారిపోతున్నాయి. పశువులు బజారున పడుతున్నాయి.

మహానంది మారు మాట్లాడకుండా నారాయణతో కలిసి బయటకి నడిచాడు.

ఎదురుగా కందిపుల్లల పాక. చాలీచాలని కప్పు రంధ్రాల్లోంచి సూర్యుడు తొంగిచూస్తున్నాడు. పాకలో ముసలి ఎద్దు, కరిగిపోతున్న మంచు కొండలా తెల్లగా మెరిసిపోతూ పడుకొని వుంది. పైకి లేపితే పరీక్షిస్తానన్నాడు నారాయణ. తోక నించీ కర్రతో పొడిచీ, ముకుతాడులాగీ బలవంతంగా పైకి లేపారు దాన్ని మరో ఇద్దరి సహకారంతో. మనవడి సాయంతో అక్కడికి చేరుకున్న కొండారెడ్డి ఆ దృశ్యాన్ని చూసి విలవిల లాడిపోయాడు.

నారాయణ ఎద్దును పరీక్షిస్తున్నాడు. వయసు తగ్గినా వన్నె తగ్గలేదు. కండరాల బిగువు తగ్గినా కరుకుతనం తగ్గలేదు. కళ్లలో జీవం ఎక్కడో లోతుల్లో మిణుకు మిణుకుమంటోంది. కాడి రాపిడికి అర్రు నల్లగా గడ్డలా మారిపోయింది. దాని పైని గాయాల గుర్తులు అది ఎన్నిసార్లు వాచి, చీమెక్కి, పుండై పగిలి అణగారి పోయిందో చెప్పకనే చెపుతున్నాయి. అరిగిపోయిన కాలి గిట్టలు అది రైతుల సేవలో చేసిన సుదీర్ఘ ప్రయాణాన్ని సూచిస్తున్నాయి. ముల్లు గర్ర పొడుగులు, చెర్నాకోల వాతలతో కూడా దాని శరీరం ఎన్నో యుద్ధాలలో పాల్గొని అలిసిపోయి విశ్రాంతి తీసుకుంటున్న క్షతగాత్రుడైన వీర సైనికుడిని గుర్తుచేస్తోంది. బాగా పండి, ఎండి, వ్రేళ్ల చెదలెక్కి చిన్న గాలి సోకినా నేలకొరిగేటట్లున్న జొన్నకర్రలా నిలబడి వుంది.

"దీనికి వయసైపోయింది పెద్దాయనా, పండ్లూడిపోయినాయ్. మేపు తిన్లేదు. పంజేయలేదు. ఎక్కువ కాలం బతకడం కూడా కష్టమే."

"అందుకే సార్ దీన్ని అమ్ముదామని బెంగ్లూరు సాయబూను రమ్మన్నా. అమ్మేది లేదు పొమ్మని తిట్టి పంపిచ్చినాడు మా నాయన... మీరైనా నచ్చజెప్పండి సార్."

"అంటే ఇంతకాలం పంజేయిచ్చుకొని ఇప్పుడు పనిచేయలేదని కసాయోడికి అమ్మేచ్చావా? సర్రైన కాపోడికి పుట్టిన్నాకొడుకెవ్వడూ ఇట్లాంటి పన్జేయడురా. మరి నేనూ మూలన పన్యా గదరా. నన్నేం జేచ్చాం చెప్పు" గట్టిగా నిల్దీశాడు కొండారెడ్డి.

"దానితో నీకు పోలికేంటి? అది పశువు, నువ్ మనిషివి"

"అదిగో ఆ కూతే కూయద్దంటున్నా. అదిపశువైతే, నువ్వూ పశువే. అది నా పెద్దకొడుకు. నువు నా సిన్న కొడుకు. ఈసారి బెంగ్లూరు సాయబూ మనింటికొచ్చే ముందు నీ కాళ్లిరగ్గొడతా" అన్నాడు కొండారెడ్డి కోపంగా.

"అది గాదు పెద్దాయనా..." అంటూ నారాయణ ఏదో అంటుండగా కొండారెడ్డి అడ్డుతగిలాడు.

"పెద్దపెద్ద ఆపరేసండ్లు జేసి సచ్చేటోన్ని గూడా బతికిచ్చాండారు గదా. పశులకు అట్లాంటియి ఎందుకు సేయరు?"

"మాటలకేం తక్కువలేదు. ఎద్దుకు వైద్యం చేయించమంటావే గానీ, నువు మాత్రం మందులేసుకోవు" అంటూ నారాయణ వైపు తిరిగి "నాల్రోజులైంది సార్ ఒకటే దగ్గు. ఒక నూరియ్యన్నాడు. తెచ్చిచ్చినా. దాన్ని అట్లాగే పంచె కొంగులో మూటగట్టుకొనుండాడు" అన్నాడు మహానంది.

"ఇచ్చినావులేరా ఎవడు కాదన్యాడు".

"ఆ నూరిట్లాయియ్యి. టౌనుకు పోతాండా. మాత్తర్లు తీసుకొస్తా".

"వద్దుపోరా. నువ్ మర్సిపోతావ్. నారాయణతో తెప్పిచ్చుకుంటా"

"ఒట్టి మొండోడు సార్. నేను కల్లం కాడికి పోయెస్తా. ఇక నువ్వే జూస్కో" అంటూ బయటకి పోయాడు మహానంది. నారాయణ, పెద్దాయన చాలాసేపు మాట్లాడుకున్నారు. నారాయణ కూడా వెళ్లిపోయాడు.

"అబ్బా నాకో సందేహం. ఎద్దును పట్టుకొని పెద్ద కొడుకంటావేంటి?" పక్కలో కూర్చుంటూ ప్రశ్నించాడు అనిల్. మనవడి తల నిమురుతూ కొండారెడ్డి పాతరలో దాచుకున్న ధాన్యాన్ని అవసరమైనప్పుడు తోడుకునే రైతులా పాత జ్ఞాపకాలను తవ్వి పోయడం మొదలుపెట్టాడు.

"ఆరోజు మహాశివరాత్రి. పొద్దున్నే కొండారెడ్డి ఇంట్లో ఆవు పురిటినొప్పులు పడుతోంది. నాలుగిండ్ల అవతల పుట్టింట్లో కొండారెడ్డి భార్యకు కూడా ఇదే పరిస్థితి. కొండారెడ్డి అక్కడికి, ఇక్కడికి కాళ్లు గాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. అక్కడైతే ఇంటినిండా మనుషులే. ఇక్కడే ఎవరూ లేంది. అందుకే ఇక్కడే ఉండిపోయాడు. అతని కళ్లెదుటే ఆవు పండంటి మగదూడను ప్రసవించింది.

"మా ఇంటికి పెద్ద కొడుకొచ్చాడు" సంతోషంతో కొండారెడ్డి కేకేశాడు.

"కొండా నీకు కొడుకురా" అక్కడ నుంచి కేక విన్పించింది.

"ఐతే రెండో కొడుక్కూడా మా ఇంటికొస్తాండాడన్నమాట" అంటూ అటువైపు నడిచాడు.

కొడుకులిద్దరినీ ప్రేమతో పెంచుకుంటున్నాడు. ఇద్దరూ కలిసే ఆటపాటలు. ఒకరు పలక చేతబడితే మరొకరు కాడి మెడకెత్తుకున్నారు. కోడెదూడ అందం, చురుకుదనం, పనితనం చూసి అందరూ మెచ్చుకుంటుంటే గర్వంగా మీసం మెలేసేవాడు. అది పడుకొని వుంటే అచ్చం లేపాక్షి నంది విగ్రహం లాగా కన్పించేది. అందుకే లేపాక్షి బసవయ్య అని పేరు పెట్టాడు. దాని జతలో ఎన్నో ఎద్దులు మారిపో

యాయి. ఒకసారి మేతకు తీవ్ర కరువొచ్చింది. అప్పుచేసి దూర ప్రాంతం నుండి మేత కొనుక్కొచ్చి దాన్ని కాపాడుకున్నాడు. అదంటే అతనికి అంత ప్రేమ మరి. కొండారెడ్డి అనారోగ్యం పాలవడంతో మహానంది మధ్యలోనే పుస్తకం వదిలేసి పగ్గాలు పట్టుకున్నాడు. అప్పుడు ఆటపాటలు, ఇప్పుడు జీవన పోరాటం. ఇద్దరూ కలిసే.

అనిల్‌కు ఏడాది వయసుంటుందప్పుడు. వాకిట్లో పడుకొని వున్నాడు. బసవయ్య లోనికి వస్తున్నాడు. పిల్లాడు ఏమైపోతాడోనని ఇంట్లో వారంతా పరుగెత్తుకొచ్చారు. బసవయ్య వాకిలి బయటే నిలబడి వున్నాడు. పిల్లాడిని పక్కకు తీశాకే లోనికి నడిచాడు. అప్పటి నుంచి అది అనిల్‌కు ఆడుకునే బొమ్మయింది. అది పడుకొని వుంటే అనిల్ దానిపైకెక్కి జారుడు ఆట ఆడడం, కొమ్ములు పట్టుకొని వేలాడడం లాంటివి చేసేవాడు. అది అరమోడ్పు కన్నులతో ఆనందించేది.

ఇలా కొండారెడ్డి ఒక్కొక్క సన్నివేశాన్ని మనవడికి వివరిస్తుంటే లలితమ్మ కూడా శ్రద్ధగా వింటూ రాగులు విసురుకుంటోంది. సాయంత్రం పూట రాగి జావ కాయించి బసవయ్యకు మరీ దగ్గరుండి పెట్టించాడు కొండారెడ్డి. అన్నం తినబుద్ధి కాలేదని తనూ జావే తాగి పడుకున్నాడు.

రాత్రి బాగా పొద్దుపోయింది. అందరూ నిద్రపోతుంటే కొండారెడ్డి మాత్రం ఆయాసపడుతూ దగ్గుతూ వున్నాడు. మహానందికి మెలకువ వచ్చి తండ్రిదగ్గరకొచ్చాడు.

''నారాయణ మందులు పంపిచ్చినాడా?''

''లేదురా రేపు వచ్చేటప్పుడు తెస్తాడంటలే''

''మరి ఇప్పుడేం ఏసుకుంటావ్. నే తెస్తానంటే ఇనవ్. సరే కొంచెం సొంఠి కాఫీ తాగు, బాధ తగ్గుతాది'' అంటూ కాఫీ కోసం భార్యను కేకేసి పశువుల మేత వేయడం కోసం బయటకి నడిచాడు.

నేలను తలమోపి కన్నీరు కారుస్తూ దీనంగా పడుకొని వున్న బసవయ్యను చూడగానే మహానంది మనసు కరిగిపోయింది. దాని విషయంలో అలాంటి నిర్ణయం తీసుకోవడానికి బలమైన కారణం లేకపోలేదు. మొదటి పైరు వేరుశనగ వర్షం చాలక ఎండిపోయింది. రెండో పైరు ధనియాలు చేతికొస్తే కొంతవరకూ కష్టాలు తీరుతాయనుకుంటే అది బూడిద తెగులొచ్చి బుగ్గిపాలయింది. అప్పు రెండింతలైంది. ఉగాది పండుగ చేసుకోడానికి కూడా డబ్బులు లేవు. ఏమి కొనాలన్నా ధరలు మండిపోతున్నాయి. కొడుకేమో పండుగకు కొత్త జీన్స్‌పాంటు కొనిమ్మని ముద్దుగా అడుగుతున్నాడు. పరిస్థితి అర్థం చేసుకున్నది కనుక భార్య కట్టుకున్న చీరె చిరుగులు భర్తకు కనిపించకుండా జాగ్రత్త పడుతోంది. ఈ పరిస్థితులను అధిగమించాలంటే ఎద్దును అమ్మడం ఒక్కటే మార్గంగా తోచింది. దానికి సాహెబ్ రెండువేలిస్తానన్నాడు. దాంతో ఎట్లాగో పండగ గడిచిపోతుంది. పైగా ఎద్దు కూడా మరణ వేదన పడుతోంది. దినపత్రికల్లో తాను చదివిన 'మెర్సి కిల్లింగ్' విశేషాలు తన నిర్ణయానికి సమర్థనగా ఉపయోగపడ్డాయి. దీనికి కొండారెడ్డి ససేమిరా అంటున్నాడు.

ఎద్దులేచి నిలబడి గాటిలోని మేపు తినే స్థితిలో లేదు. మెత్తని వేరుశనగ పొట్టును పుల్లల నుంచి వేరు చేసి దానికి అందుబాటులో పెట్టి ఇంట్లోకి వచ్చాడు. తండ్రికి సొంఠికాఫీ తాగించి పడుకున్నాడు. ఎన్నో ఆలోచనలు, బసవయ్యతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటుంటే కళ్లు చెమర్చాయి. గంపెడు మేత, కడివెడునీళ్లు తప్ప మరే ప్రతిఫలం ఆశించకుండా జీవితాంతం వెట్టి చాకిరీ చేసిన బసవయ్యను బ్రతికుండగానే కబేళా పంపాలని అనుకోవడం అమానుషం అనిపించింది. తండ్రి లోని మానవతా విలువలు ఇప్పుడు అవగాహనకొచ్చాయి మహానందికి. తన ఆలోచన మార్చుకున్నాడు. ఉదయాన్నే ఎద్దుకు వైద్యం చేయించాలనుకున్నాడు.

***

తెల్లవారింది. ఇంటి ముందు జనం గుమికూడి వున్నారు.

''పుణ్యాత్ముడు శానాకాలం మంచంలో పడుండకుండానే దాటుకున్నాడు''

''ఇంత మంచి ఎద్దును నేనెక్కడా చూల్లేదు. కొండారెడ్డి పిల్చుకున్నట్లు ఇది నిజంగా లేపాక్షి బసవయ్యే''

''ఇద్దరూ కల్సే బతికినారు. కల్సే పోతుండారు''

మహానంది కుటుంబం విలపిస్తోంది. కొందరు ఓదారుస్తున్నారు. కొందరు అంతిమ యాత్రకు సన్నాహాలు చేస్తున్నారు. నారాయణ వచ్చాడు మందులు తీసుకొని.

''పెద్దాయనకు ఎద్దంటే ఎంత ప్రేమో. 'నా ఆరోగ్గెం బాగానే ఉందిలే నారాయణా. మందులు ఎద్దు కోసమంటే వాడు డబ్బులియ్యడు. అందుకే నాకు ఒంట్లో బాగాలేదని చిన్న అపద్ధం చెప్పాన'ని పెద్దాయన నాకే పెద్ద అపద్ధం చెప్పినాడు. దాని ప్రాణం నిల్పడం కోసం తన ప్రాణాలను అర్పించాలనుకున్నాడు. 'మంచి సూదులు మందులు ఏసి ఎట్టాగైనా దీన్ని బతికించు. ఈ యిసయం మా ఓడికి చెప్పాకు, కోప్పడతాడు' అంటూ కొడుకిచ్చిన వందతోపాటు ఎప్పటినుంచో తను దాచుకున్న మరో వంద కూడా నిన్న నా చేతికి ఇచ్చాడు'' అంటూ నారాయణ మందుల సంచి చూపించాడు.

''ఎద్దును ఎత్తుకెళ్లమని గంగన్నకు చెప్పుపోండి'' అన్నారొకరు. అనిల్ ఏడుస్తూ ముందుకొచ్చాడు.

''వద్దు నాయనా. గంగన్న దాన్ని ముక్కలు ముక్కలుగా కోసేస్తాడంట గదా. అబ్బ సెప్పినాడు. అబ్బకది ఇష్టంలేదట. 'నేనే ముందు చనిపోతే తరువాత దాన్ని కూడా నా పక్కనే సమాధి చేయాల్రా. దీనికి మీ నాయన్ను నువ్వు ఒప్పించాలరా' అని అబ్బ అన్నాడు'' అని అభ్యర్థనగా అడిగాడు.

ఇంతవరకు కన్నీరు కార్చని వారు సైతం కరిగిపోయారు ఆ చిన్నారి మాటలకు.

కల్లంలో రెండు గుంతలు తయారవుతున్నాయ్. సాయంత్రానికి రావలసిన వారంతా వచ్చారు. ముందు బసవయ్య బండిపై, వెనకే కొండారెడ్డి పాడెపై. నేల తల్లి ఒడిలోని మహాప్రస్థానం. వారి వెనకే ఊరు ఊరంతా. అంతిమ వీడ్కోలు చెప్పడం కోసం తరలిపోతున్నారు.

★

## రచయితల చిరునామా

**కమిషనర్ క్రిష్ణమన్**
చిలుకూరి అన్వేషి
201, చంద్రప్రియ టవర్స్
రైలుస్టేషన్ దగ్గర
అనంతపురం-515001

**నిర్ణయం**
సిహెచ్. శివరామ ప్రసాద్ (వాణిశ్రీ)
స్వగృహ అపార్ట్‌మెంట్స్, 'సి' బ్లాక్,
భాగ్యనగర్ కాలనీ,
కెపిహెచ్‌బి ఎదురుగా,
కూకట్‌పల్లి, హైదరాబాద్-500072.

**పెద్దకొడుకు**
వై. రామాంజనేయులు రెడ్డి,
ఎంపిపి స్కూలు టీచరు,
పెద్దజూటూరు పోస్ట్,
పులివెందుల, కడప జిల్లా-516390

---

### గతవారం ప్రచురించిన కథల రచయితల చిరునామాలు


**మన్నించుమా ప్రియా**
సాహిత్య ప్రకాశ్
16-7-813/6,
వినాయక వీధి, న్యూమలక్‌పేట,
హైదరాబాజిద్ - 500 024.

**మళ్లెప్పుడొత్తాది 'వరద'?**
డా. వి. పోతన్న
ఎనౌన్సర్, ఆల్‌ఇండియా రేడియో,
కర్నూలు.

**క్రిమినల్ బ్రెయిన్**
ప్రతాప రవిశంకర్,
కేరాఫ్ జి. రామకోటయ్య
ఇం.నెం. 5-51-44,
5/17, బ్రాడీపేట,
గుంటూరు - 522 002.



# ప్రపంచం






## ఐస్ కట్టడం

దుబాయ్‌లో ఒకాయనకి ఐస్‌తో భవంతి నిర్మించాలని కోరిక పుట్టింది. షేక్‌లు తలుచుకుంటే జరగని పనా? ఇక్కడ కనిపిస్తున్న ఈ మీనియేచర్ వర్క్ మొత్తం ఐస్‌తో చేశారు. టేబుళ్ళు, కుర్చీలు కూడా!

## డాన్స్ బేబీ డాన్స్

ఆడుతూ పాడుతూ ఆనందంగా జీవించాలి. అదే జీవితం, జీవన సారాంశం. అర్జెంటీనాలోని ఒక సంస్థ డాన్స్ పోటీలు పెట్టింది. దంపతులకు మాత్రమే ఈ పోటీలో ప్రవేశం. జపాన్‌కు చెందిన దంపతులు మైమరిచి నృత్యం చేస్తున్న దృశ్యమిది.



## గ్లోబల్ వార్మింగ్

జింక చూడడానికి అందంగానే వుంటుంది కానీ, అది గ్లోబల్ వార్మింగ్‌కి కారణమవుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏడాదికి 2100 కిలోగ్రాముల మిథేన్ వాయువుని ఉచ్ఛ్వాస నిశ్వాసాల ద్వారా జింక విడుదల చేస్తుందని కనుగొన్నారు. నార్వే అడవుల్లో లక్షా నలభై వేల జింకలు వున్నాయట. వీటి వల్ల పర్యావరణం దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు.

Printed and Published by **Vemuri Radhakrishna,** Managing Director, on behalf of Aamoda Publications Pvt. Ltd., Plot No.76, Aswani Layout, Huda Heights, Jubilee Hills, Hyderabad-500 033. Ph.(040) 23558233/44. Fax No.23558288. Printed at Aamoda Press, R.S.No.191/3, Ward No.43, Donka Road, Patamata, Vijayawada - 520 010, Reg.No.: APTEL/2004/12594. Editor: **Sriramana**